

# గాలిలోని పక్షులు





ఇంకా పూర్తిగా తెల్లారలేదు. గడపలో కూర్చుని నల్లగా, చేదుగా, హాయిగా నాలుకపై జారే కాఫీని రుచి చూస్తూ - రోడ్డుపై న్యూస్ పేపర్ కుర్రాడు, పేపర్ని మడతపెట్టి, టప్‌మంటూ లోపలికి విసిరివేశాడు.

తల చుట్టూ సన్నటి మఫ్లర్. ఆ కుర్రాడొక వింత. అంత చిన్న వయసులోనే ప్రపంచం కంటే ముందు పరిగెత్తటం నేర్చుకొన్నాడు వాడు.

ఆ కుర్రాడు ఉదయానికీ, రోడ్డుకీ అందంలా తోస్తాడు. చావు, నెరవేరని కోరికలు, మహోద్వేగమైన ప్రేమలు, ఏవీ నిజం కాదు. శ్రమ, మానవుడి శ్రమ మాత్రమే నిజం అనిపిస్తుంది - వాణ్ణి చూస్తుంటే.

మామ్మగారు చనిపోయాక ఇంట్లో నుంచి ప్రేమ వెళ్ళిపోయినట్లనిపిస్తుంది. ఆమె చనిపోవటం ఒక సింబాలిక్ కారణం. అసలు కారణం వేరే ఉంది. కనపడని హింస మెల్లమెల్లగా ఇంటిని ఆక్రమించింది.

వీ.టీ.వీ, ఫ్రాంక్ సినెట్రా, డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్, ఛానల్స్ 1 నుండి 100 దాకా, వికృతమైన వీజేల అలంకరణ, చౌకబారు నవ్వులు - ఉదయాన్నే, ఈ గడపని దాటి వెళితే రోజంతా అదే ప్రదర్శన.

మనసునీ, ఉద్వేగాల్నీ మా బట్టలులాగే గోడలకు తగిలించి శరీరాన్ని యింటి మధ్యన ఫ్లోరింగ్‌కి అతికిస్తాం. నాలుగు మాంసపు ముద్దలు - ఇంట్లోని ఫ్లోరింగ్‌కు అతుక్కుపోయి, ఇక రోజంతా ఛానళ్ళ దాడి. ఇది ఒక ఎడిక్షన్. మత్తుమందు పుచ్చుకొనేవాడికి, ఒక రోజైనా మందు లేకపోతే విలవిలలాడినట్లు - ఇంటిల్లిపాది ఎర్రబడ్డ కళ్ళు, స్పర్శ, స్పందన తెలియనితనంతో -

'అంతరంగాలు', 'ఋతురాగాలు' మధ్యాహ్నపు సినిమా - ఏదో ఒకటి కాస్త రమ్ము, కాస్త జిన్ను, విస్కీలో కలిపి కాక్‌టైల్‌లా సేవించినట్లు - ఇంట్లో పెద్దగా మాటలు ఉండవు. అన్నీ చకచకా మూకీ సినిమాలోలాగ - సంఘటనలే ఉంటాయి. సంజాయిషీలు, కోపాలు, స్వీట్ నథింగ్స్, కన్ఫెషన్స్ ఏమీ ఉండవు.

మొరటుగా అనిపించే ఒంటరితనం. బయట ప్రపంచానికీ, మాకూ సంబంధాలు తెగిపోయాయి.

ఒక మరబొమ్మ మాదిరిగా ఆయన బ్రీఫ్‌కేసు తీసుకొని ఆఫీసుకు బయల్దేరి వెళతాడు.

వెళ్ళే ముందు గంటపాటు ఎంటీవీనో, వీటీవీనో తప్పనిసరి మందులాగా చూస్తాడు.

మధ్యలో మా పెద్దబ్బాయి ఛానల్ మార్చి డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ లేదా క్రికెట్ కోలాహలాన్ని ఇంట్లోకి ప్రవేశపెడతాడు. ఆ కాస్త స్పోర్ట్స్ వైలెన్స్‌నూ చూసి, వాడు స్కూల్ బ్యాగ్‌తో ఇంటిని దాటతాడు.

అసలు నరకం అప్పటి నుండి మొదలవుతుంది. రిపీట్ సీరియల్స్‌తో మొదలుపెట్టి సాయంకాలం నాలుగుదాకా - ఇంటినిండా వింత వింత మనుషులు, వసుధలు, గోపాల్‌లు - మధ్యమధ్య వందలాది యాడ్స్, ఆ సబ్బుతో ఉతకమని, ఈ కూల్‌డ్రింక్‌ని ఒక్కసారి తాగమని - అన్నీ కలిసిపోయి - ఒక విజువల్ భ్రమ ఏర్పడి - నన్నయ మహాకవి, మాధురీదీక్షిత్‌తో డాన్స్ చేస్తున్నట్లు, శ్రీశ్రీ సిగరెట్టు పొగలోంచి పొడవాటి ఒంటెలు, తాబేళ్ళు బయటకు దూకుతున్నట్లు -

నా శరీరం చుట్టూ కోకాకోలా సీసాలు, రిన్ సబ్బులు, మసాలాపొడులు, అగరబత్తులు కొల్లలుగా చుట్టచుట్టుకొని పోయినట్లు - అన్నట్లు భగవంతుడు కూడా - షేక్స్పియర్ రూపంలో కనబడి, కాసేపటికి గద్దర్‌లా స్ట్రీట్ పొయిట్‌లా మారిపోవటం కూడా జరుగుతుంది - ఈ భ్రమ వాతావరణంలో.

పదిహేను రోజుల క్రితం, ఇట్లాంటి ఉదయమే - ఒక భయానక దృశ్యం. పదేళ్ళ మా పెద్దబ్బాయి రామం ఇంటి ముందున్న గార్డెన్‌లో అటూ ఇటూ తిరిగి - సీతాకోక చిలుకల్ని వెంటాడుతున్నాడు. అట్లా వెంటాడుతూ ఒక సీతాకోకచిలుకని చేతుల్లోకి తీసుకొని, క్రూరంగా నలిపి - నా గుండెలు భయంతో బరువెక్కాయి.

ఆ సీతాకోకచిలుక శవాన్ని గోడకు వేలాడదీసి, దాని మీద రెండు, మూడు చీలలు దించి, దానిపై స్కెచ్‌పెన్‌తో "ది బటర్‌ఫ్లై ఛానల్ - జననం: తెలియదు. మరణం : ఇవాళే" అని రాశాడు.

నేను కంగారుగా ఆయన్ని నిద్రలేపి తీసుకువచ్చేసరికి గోడపైన శవం లేదు. రాతలు కూడా చెరిగిపోయాయి. "అంతా నీ భ్రమ!" అంటూ ఆయన నన్ను కొట్టిపారేయటం - కానీ ఆ మధ్యాహ్నం డస్ట్‌బిన్‌లో బ్రిటానియా బిస్కెట్ రేపర్‌లో చుట్టబడ్డ సీతాకోకచిలుక శవం నన్ను వింత భయంలోకి తోసివేసింది.

మామ్మగారు బ్రతికున్న రోజుల్లో పిల్లల గురించి దిగులే ఉండేది కాదు. పొద్దున్నే తనతోపాటు ఆరింటికే నిద్రలేపి అట్లా వాకింగ్‌కి అంటూ రోడ్డుపైకి తీసుకెళ్ళేది. వచ్చిన తరువాత, ఇంటి ముందు ఊడవటం, ముగ్గు లేయటం, కొద్దో గొప్పో గార్డెనింగ్ చెయ్యటం - పిల్లలు ఆవిడతోటే ఉండేవాళ్ళు.

సాయంకాలాల పూట దగ్గర కూర్చోబెట్టుకొని వేమన పద్యాలో, సుమతీ శతక పద్యాలో వల్లె వేయించేది. ఇక రాత్రికి నిద్రపోబోయే ముందు అద్భుతమైన

కథలో, జానపద కథలో, పౌరాణికాలో - ఆ కథల ఇంద్రజాలంలోనే వాళ్ళు నిద్రపోయేవాళ్ళు.

మామ్మగారు పోయిన రెండు నెలలకే ఇంట్లో కలరు టీ.వీ. వచ్చేసింది. దిగులుగా ఉందనో, బోరుగా ఉందనో ఒక సాకుతో టీ.వీ. ఇంట్లోకి ప్రవేశించింది.

ఇప్పుడు ఇంట్లో నలుగురికి ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అన్నీ టీవీనే. చిన్నది ఆరేళ్ళది. అది ఇంకా టీవీకి అలవాటు కాలేదు. దానితో ఆడుకోవడానికి మాట్లాడడానికి మనుషులే దొరకరు. ఏదో ఒకరోజు ఈ టీవీని బద్దలు కొడతానని బెదిరిస్తూ ఉంటుందది.

వారం క్రితం - క్రోటన్ మొక్కల మధ్య కర్ర - కర్ర చివరన ఊరపిచ్చుక శవం కనబడి - గుండెలు అవిసిపొయ్యాయి. ఇంగ్లీషు సినిమాల్లో క్రాస్‌లాగా రెండు కర్రల్ని కట్టి - ఆ కర్రలకు - దాని రెక్కలు విరగదీసి - పిచ్చుక శవం వేలాడదీసి ఉంది.

అది మొదటి రాత్రి. ఇంట్లో టీ.వీ. వెలగకుండా, మోగకుండా ఉన్న రాత్రి. శ్రీవారి ముఖంలోనూ వింత భయం. "డాక్టరును కలుద్దామా? సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళదామా?" ఆయన ముఖంలో భయం స్పష్టంగా తెలుస్తోంది. రేడియోలో బాలల కార్యక్రమాన్ని చూసే ఒక స్నేహితురాలికి కబురు చేశాము.

ఆమె ఈ విషయాన్ని తేలిగ్గా కొట్టిపారవేస్తూ "ఇదేం పెద్దగా భయం కలిగించే విషయం కాదు, వాడికి డైవర్షన్ ఇవ్వండి. పుస్తకాలు, స్నేహితులు, ఆటలు, ఏదో ఒకటి ఊపిరి సలపనివ్వకుండా చూడండి. మీరు కూడా టీవీ చూడటం తగ్గించండి" అంటూ ఓదార్చింది. మరుసటి రోజు నుంచీ టీవీ చూడటం చాలా వరకు తగ్గించాము. డైలీ, వీక్లీ సీరియల్స్ మాత్రం చూసి మిగతావి ఆపేయాలనుకొన్నాం.

ఊహు ! సాధ్యం కాలేదు. ఏదో పోగొట్టుకొన్న బాధ. భరించలేనంత బోరు, విసుగు. టీవీ చూడకుండా ఉండటమే సాధ్యం కాదనిపించింది.

ఆయన కూడా ఎంటీవీ, యుటీవీలు చూడకపోతే సెలైన్ పెట్టడం ఆపేసిన పేషెంటులా మారిపోవటం గమనించాను. అందుకని ఇంటికి దగ్గర్లోనే వాడికి రెండు కొత్త ట్యూషన్లు ఏర్పాటు చేశాము.

ఊపిరి సలపని హోంవర్కు ఇమ్మని క్లాస్ టీచర్‌కి చెప్పాము. వారం రోజుల్లో పరిస్థితి మారింది. వాడు ఇంట్లో ఉండే ఆ కొద్ది నిముషాలు టీవీ కట్టేసి ఉంచి మొత్తానికి - టీవీ దాడి నుంచి వాణ్ణి కాపాడేమని హాయిగా నిట్టూర్చాము.

నిన్న ఉదయం, ఒంట్లో నలతగా ఉండి, అట్లాగే మంచంపై పడుకొని ఉండగా - ఏడు గంటల టైములో కాఫీకప్పుతో నా గదిలోకి వచ్చాడు రామం. "మామ్! కాఫీ ఫర్ యు!" అంటున్న వాణ్ణి చూసి బోలెడంత ముచ్చటేసింది. 'పిచ్చి వెధవకి మేమంటే ఎంత ఇష్టం!' అని ముచ్చటపడ్డాను. "టిఫిన్ కూడా నేనే చేస్తాను! మీరు జస్ట్ టేబుల్ దగ్గరకు రండి చాలు!" అన్నాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర చిన్నది సీత భయంభయంగా చూస్తోంది. ఫ్రైయింగ్ పాన్‌లో నల్లగా మాడి, కమురు వాసనవేస్తూ - "బటర్ ఫ్లైస్ అండ్ పారెట్స్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో ఫ్రై చేశాను. కమాన్ టేస్ట్ యిట్" నా గుండె శృతి తప్పింది. "బ్లడీ ఇడియట్! యుహావ్ బికమ్ ఏ సైకో" అంటూ వాళ్ళ నాన్న పెద్దగా అరుస్తున్నాడు. హఠాత్తుగా చిన్నది పెద్దపెట్టున గుండెలవిసేలా ఏడవటం మొదలుపెట్టింది. రామం అట్లాగే నిలువు గుడ్లు వేసుకొని చూస్తున్నాడు.

ఆ షాక్‌లో నుంచి తేరుకోవడానికి చాలాసేపు పట్టింది నాకు. తేరుకొన్నాక, వాణ్ణి దగ్గరకు లాక్కొని - బుగ్గలు నిమురుతూ - "అందమైన పక్షులు, చిన్నచిన్న ప్రాణులు కదా, అవి అట్లా గాలిలో ఎగురుతుంటే, ఎంత ముచ్చటగా ఉంటుంది. వాటిని చంపాలనే కోరిక ఎందుకు కలుగుతుంది?" అన్నాను లాలనగా.

"ఏమో?" అన్నాడు నిర్లిప్తమైన ముఖంతో.

"ప్రాణం పోవటం ఎంత దుర్భరమైన విషయం. ఎవరిదైనా. ఆవేళ, మామ్మ పోయినప్పుడు ఎంతగా ఏడ్చాము. వీటి ప్రాణం కూడా అంతేగా" క్షణంసేపు ఆగి.... వాడు

"వాటిని వెంటాడి, చంపటంలో థ్రిల్ ఉంది. డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్‌లో బాక్సింగ్ పంచ్ యిస్తారు చూడు... అట్లా మజాగా ఉంటుంది".

అవాక్కయిపోయాను నేను. ఏం మాట్లాడాలో తోచలేదు. భుజం మీద చెయ్యివేసి బయటకు తెచ్చాను. ఎండ తళతళా మెరుస్తోంది. కిచకిచమంటూ చెట్లపై నుండి అరుపులు, క్రోటన్ మొక్కలపై నుండి సీతాకోకచిలుక రంగుల పుష్పంలా అటూ ఇటూ ఎగురుతూ కనిపించింది.

"అట్లా ఎగురుతూ పాడుతూ హాయిగా ఉండటమే, అన్ని ప్రాణుల లక్షణం. ఇదుగో మనమే మనుష్యులం - ఇట్లా అయిపొయ్యాము. టీవీలకు అతుక్కుపోయి, మనం కదలగలమన్న విషయాలన్నీ మరచిపోయాము" వాడికి అర్థమయ్యీ, అర్థంకాక - "పద ఈ చనిపోయిన వాటిని ఎక్కడన్నా నేలలో పూడ్చిపెడదాము" అంటూ బయటకు నడిచాను.

పెరట్లో గొయ్యి తవ్వి నాలుగు సీతాకోక చిలుకల శవాల్ని, రెండు పిచ్చుకల శవాల్ని అందులో పెట్టి, మట్టి కప్పి, పైనొక పూలచెట్టు నాటాము.

'ధన్' మంటూ ఇంట్లో నుంచి చప్పుడు. చిన్నది సీత స్టాండ్‌పై నుంచి టీవీని అమాంతంగా కిందకు దొర్లించింది.

"అయ్యో!" అని దిగులు పడబోయి, కోప్పడబోయి, ఆగాను. "దీన్ని కూడా గుంట తవ్వి నేలలో పాతిపెడదామా?" అంది అమాయకమైన ముఖంతో. నేను నవ్వి, "అది ప్రాణం లేనిది. ఏరి డస్ట్‌బిన్‌లో వేస్తే సరిపోతుంది" అన్నాను.

* * *

మెల్లగా తెల్లవారుతూంది. చీకటి పూర్తిగా తొలగి విరగబూసిన మల్లెల పొదలా ఉంది ఆకాశం.

అందరి ఇళ్ళల్లో పేపర్లన్నీ యిచ్చి, హుషారుగా సైకిల్ తొక్కుకొంటూ ఇంటికి వెళుతున్నాడు పేపర్‌బాయ్.

కప్పులో కాఫీ వెచ్చగా నా పెదాలపై నుంచి లోపలికి జారుతోంది. జాగింగ్ నుంచి తిరిగి వస్తున్నారు ఆయన రామం, సీత పక్కనే నడుస్తుండగా. "వేరుపురుగు చేరి వృక్షమ్ము చెరచును" అంటూ ఆయన రామానికి వేమన పద్యాల్ని వల్లె వేయించటం వినిపిస్తూంది.

నా పక్కనే కాఫీ ఫ్లాస్కు, దాని పక్కన బూజు దులిపి, మళ్ళీ బ్యాటరీలు వేసిన పాకెట్ రేడియో, సన్నటి లలితగీతమేదో పాడుతోంది. తలుపు తీసి లోపలికి వస్తున్న రామానికి, మెట్లపై రెక్క విరిగిన సీతాకోకచిలుక పడి ఉండటం కనిపించింది. వాడు దానిని ఏం చేస్తాడా అని ఆసక్తితో చూస్తున్నాను.

*- స్వాతి సపరివారపత్రిక, 10-12-1999*